# రాజకీయం

ఉద్యోగం వచ్చినపుడైనా అంత సంతోషపడలేదు శంకరం. కోరుకున్న ఊరికి బదిలీ అయినపుడూ యింత సంతోషం కలుగలేదు. లెక్చరర్ అల్లుడు అతి తక్కువ కట్నంతో అల్లుడుగా దొరికిన సంతోషం వేరు. సీతాఫలానికీ మామిడి పండుకు ఉన్న పోలిక తీపి. దేని రుచి దానిదే. ముప్పయి ఏళ్ళ ఆశ. ఇరవై ఏళ్ళకల, ఆరు నెలల ఆరాటం, మూడు నెలల పోరాటం. ఎన్నిపావులోకదిపాడు. ఎలాగైతేనేం మీరే దిక్కు అన్పించుకున్నాడు శంకరం.

ఒక జాతీయ పార్టీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో శంకరం గారికి తానుకోరుకున్న నియోజక వర్గంలో టికెట్ ఖరారు చేసింది. తాను ఉద్యోగం చేసినపుడు రాజకీయ నాయకులతో అనుభవించిన కష్టాలు, నాయకులు చూపిన షటాటోపం, వారికున్న ప్రజాదరణ చూశాక శంకరంగారు రాజకీయాల్లోకి తానూ దిగక తప్పదనుకున్నారు. ఇంత గొప్పమేధావిని, పరిపాలనాదక్షుడిని కనీసం సభలకు వక్తగానైనా పిలిచేవారు కరువయ్యారు. తన ఈ అనుభవాలు సమాజానికి ఉపయోగపడాలనే అచంచల కర్తవ్యంతో శంకరం గారి నిర్ణయం తీసుకున్నారు. టికెట్ ఖరారు కాగానే ఎందరికో తన క్లాసుమేట్ ఈశ్వరయ్యతో ఫోన్లు చేయించాడు. ఎందరో అభినందిస్తూ ఫోన్లు చేసారు. అప్పుడే ఎమ్మెల్యే అయినంత సంతోషంతో ఉబ్బిపోయారు శంకరంగారు. వారి ముఖంలో అధికార తేజస్సుతో మెరుపు పెరిగిపోయింది.

అయితే ఆ సంతోషం వారంరోజులైనా మిగల్లేదు. మిగలకుండా చేసింది సొంతకూతురు లతే. నాన్న పేరిట, అమ్మపేరిట ఉన్న ఏ ఆస్తికొన్నా, కుదువ బెట్టినా చట్టరీత్యా చెల్లనేరవు అని పత్రికల్లో అడ్వకేటుద్వారా ప్రకటన యిప్పించింది లత. కోర్టులో, మున్సిపాలటీలో, సబ్‌కలెక్టర్ ఆఫీసులో, రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఈ విషయమై సమాచారం యిస్తూ పిటీషన్ యిచ్చింది. శంకరంగారికి ఎర్ర చీమలు శరీరం అంతా కుట్టినట్టుగా ఉంది.

దానికి తోడు రెండు రోజుల తర్వాత ఈశ్వరయ్య గారికి ఫోన్ చేసి చెప్పింది లత. దాన్ని ఈశ్వరయ్య శంకరానికి చేరవేశాడు.

"అంకుల్! మా నాన్నకు పిచ్చిలేసింది, మెంటల్‌కేసు, ఎర్రగడ్డ దవాఖానాలో చేర్చడానికి నువ్వు కూడా వెంటరావాలి." అని అన్నది లత. శంకరానికి నిజంగానే పిచ్చిలేసినంత కోపం వచ్చి అన్నాడు.

''ఇంతకూ దాని ఉద్దేశమేందటరా!''

''ఉద్యోగానికి రాజీనామా చేసి ఆమెనే ఎన్నికల్లోనిలడుతుందట. తన భర్త లెక్చరర్ గనక ఉద్యోగానికి రాజీనామా చేసినా ఆర్థికంగా యిబ్బందేమీ లేదట. తనకోసం టికెట్‌కు ప్రయత్నం చేయుమని చేప్తే నీకోసం ఖరారు చేసికొని రావడం మెంటల్ కాక మరేమిటి అని అన్నది లత'' అన్నాడు ఈశ్వరయ్య తాపీగా.

''అయితే పిచ్చి లేసింది నాకు కాదు దానికే. ఆ విషయం దానికి నువ్వు ఎందుకు చెప్ప లేదురా! అది ఒక్కనాడైనా రాజకీయాల్లోకి దిగుతానని చెప్పిందా?'' అంటూనిప్పులు తొక్కినట్టు కోపంగా చిందులు వేశాడు శంకరం. శంకరంను ఆ అవతారంలో చూసి పడీ పడీ నవ్వుతున్నాడు ఈశ్వరయ్య.

''అరే శంకర్! ఆ మాటకొస్తే రాజకీయాల్లో దిగుతానని ఇందిరా గాంధీ చెప్పిందా, రాజీవ్ గాంధీ చెప్పాడా, సోనియా గాంధీ చెప్పిందా! రబ్రీదేవి చెప్పిందా! లతకు తెల్సిన రాజకీయం నీకు తెలియకపాయె. రాజకీయాల్లో ఎపుడూ అఫెన్సుదాడే ఉంటుంది. ఎదుటి వాళ్ళు ఏది చెప్పి డిఫెన్సులో పడేయాలని చూస్తారో దాన్నే ఎదుటివారి మీద విసరడం అఫెన్సు. నాకోసం టికెట్ తెస్తానని బయల్దేరి తనకోసం ఖరారు చేసుకొని రావడం, నాన్న ఎంత స్వార్థపరుడో తెలుపుతున్నది. సొంత కూతురుకే చేయలేనివాడు సమాజానికేం మేలు చేస్తాడని లత ఈ పాటికే నీమీద ఆరోపణలు చేసింది. అవి రేపో మాపో పత్రికల్లో రాబోతున్నాయి.''

''దాన్ని పువ్వుల్లో పెట్టి పెంచాను, అరికాలు కందిపోతే నా చెంపకు రాసుకున్నాను. ఎంతెంత నీచంగా మాట్లాడుతోందిరా! అసలు దాని టికట్ కోసమే తిరుగుతున్నాని అది ఎందుకనుకుందట. అది ఒక్కమాటా చెప్పక పాయె.''

''శంకర్! నువ్వు పార్టీల చుట్టూ తిరిగితే అయిదేళ్ళక్రితం లత పెళ్ళికోసం సంబంధాలను వెతుకుతూ తిరిగినట్టే ఇపుడూ తనకోసమే తిరిగావనుకుందట. కాని నీలో యింత స్వార్థం ఉందని తెలియదట.''

''ఎన్ని అబద్దాలు. ఎన్ని మాటలన్నదిరా! ఇక దాని మొహం ఎట్లా చూడాలె.''

''శంకర్, నీకు నాయకత్వ లక్షణాలు యింకా అబ్బలేదురా! ఉట్టి సెంట్‌మెంటల్ ఫూల్‌వి. రాజకీయాల్లో తిరిగే వాళ్ళు మొట్టమొదట సంపాదించాల్సింది కార్యకర్తలు కాదు. పార్టీ టికెట్ కాదు, డబ్బు అంతకన్నాకాదు.''

''మరేమిటి ఈశ్వర్'' అంటూ ఆశ్చర్యపోయాడు శంకర్''

''రాజకీయాల్లో తిరిగే వాళ్ళు మొట్ట మొదట సంపాదించాల్సింది ఆత్మ విశ్వాసం. తొక్కుడు బండకున్నంత ఓపిక. కడుపులో ఉన్నది బయటకు మాట్లడకపోవడం. మాట్లాడింది అసలు గుర్తుంచుకోకపోవడం: ఈ లక్షణాలు నువ్వు సంపాదిస్తే నీవిలా చిందులు వేయవు. లత నీకు కూతురులా కనపడదు. ఒక ఓటరులా కనబడుతుంది'' అన్నాడు తత్వ గురువు పోజుకొట్టిన ఈశ్వరయ్య.

''ఓటరేందిరా!.... కన్న కూతురే ఎదిరిస్తుంటే నీకు తమాషాగా ఉందా?''

''ఒక్క ఓటరు ఎదురుదాడిని ఎదుర్కోలేని వాడివి ఎన్నికల్లో నిలబడ్డం దేనికి? ప్రతి ఓటరుకూ ఎన్నికల్లో పోటీచేసే హక్కు ఉంది. నీ కూతురు కూడా ఒక ఓటరే. ఇది అర్థమైతే ఇంత ఆందోళన ఉండదు. నీ కెందుకురా రాజకీయాలు? ఏ రుషికేష్‌కో పోయి సన్యాసం పుచ్చుకోరా!

రాజకీయాలు వృద్ధాశ్రమం కాదు ముసలిగాడిదలంతా తగలబడ్డానికి. ముసలిగాడిదల వల్ల దేశం యిప్పటికే నాశనమైపోయింది అని అన్నది లత. ఆమె రాబోయే అసెంబ్లీలో అరవైఏళ్ళు దాటిన ముసలివాళ్ళు పోటీచేయకుండా ఒక ప్రయివేటుబిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ చేత ఆమోదింపచేసి రాష్ట్రపతికి, పార్లమెంటుకు సిఫారసు చేయిస్తుందట. రాజకీయాలు యువకుల యుద్ధం అంటూ లత ఎన్ని తిట్టిందో. నా నోటితో చెప్పలేనురా!" అన్నాడు ఈశ్వరయ్య.

"ఇది నిజంగా మెంటల్ కేసే. ఎన్నిరోజులైందిరా దీనికి పిచ్చిలేసి."

"ఆ మధ్య పద్మశాలీ మేళా అంటూ పెట్టి కుల సంక్షేమం వదిలి ఎన్నికల రాజకీయాల్నే పొద్దంతా చర్చించారట గద మీరు? లత పొద్దుట్నించి రాత్రి దాకా అందర్నీ గమనిస్తూ ఉందట. ఇంటికిపోయి చెవులు దులిపితే రెండు కిలోల మాటల రత్నాలు కిందబడ్డాయట. ఇంకా ఎన్ని లోపలే ఉండిపోయాయో. చెప్పులోనిరాయి. చెవిలోని జోరీగ ఇంటిలోని పోరు ఇంతంత కాదయా అని వేమన ఊరికే అన్నాడా! అదే నా ఇన్స్పిరేషన్ అంది లత." అన్నాడు ఈశ్వరయ్య.

"రాజకీయాలంటే ఎం.ఏ.లో గోల్డుమెడలు సాధించినంత తేలిక అనుకుంటున్నదా అది! తెలివితేటలే ప్రధానమైతే లట్టుగాడు, పొట్టుగాడు, ఏ ఉద్యోగం, ఏపనిలేని వాడు, ప్రాక్టీసులేక ఈగలు కొట్టుకునే వకీళ్లు నాయకులెట్లా అవుతార్రా! రాజకీయాల్లో డబ్బే ప్రధానమైతే ఈ పాటికి రాష్ట్రంలో కోమట్లు అధికారంలో ఉండేవాళ్ళు. ఒక్క రోశయ్య తప్ప కోమట్లనుండి ఎదిగిన నాయకులేరి?" అన్నాడు శంకరం.

"ఫర్లేదురా! నీక్కూడా రాజకీయం అంటే తెలుస్తోంది. నాశిష్యరికంలో యిలా ఎందరో ఎదిగారు. అయినా ఇలాంటి రాజకీయాల్లో గెలిచే కిటుకులెన్నో తెల్సుకోవడానికి ఎవరెవర్నో పిలిచి రాజకీయ శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నారట. అది రహస్య సమావేశం. కొద్దిమందికే ప్రవేశం. లత చెప్పింది అయితే నాన్నకు చెప్పకు అంకుల్ అని చెప్పిందిరా." గుసగుసగా అన్నాడు ఈశ్వరయ్య.

శంకరం అహం దెబ్బతిన్నది. తనకు ఆహ్వానం లేదు. ఏ ఆహ్వానం లేకుండా వెళ్ళడం ఎలా? అదీ ఎవరో చెప్తే వినడానికి, తాను మాట్లాడేదేమీ ఉండదు. ఇన్నాళ్ళు తాను చెప్పడమే గానీ ఎదుటివారు చెప్పేది విన్న అలవాటు లేదు. కుడితిలో పడ్డ ఎలుకలా గిలగిలాడాడు శంకరం. ఎలాగైనా అడ్రసు సంపాదించి అక్కడేం జరుగుతున్నదో గమనించి జాగ్రత్త పడ్డం కోసమైనా వెళ్ళాలనుకున్నాడు శంకరం.

శంకరం చేరే సరికి ఆపూట క్లాసు అయిపోవచ్చింది. నిండా మూడు పదులు నిండని కుర్రాడు బోధాయన క్లాసును ముగిస్తున్నాడు. ఓ పక్క కార్పెట్లో కూలబడ్డాడు శంకరం.

"మీరు ఇంత దాకా రాజకీయాలు వాటి ప్రాముఖ్యత గురించి విన్నారు. జాతీయోద్యమంలో ఒకే కులంవారు ఎందుకు ఎక్కువసంఖ్యలో వచ్చారో, స్వాతంత్ర్యానంతరం ఆయా రాష్ట్రాల్లో ఒక్కొక్కకులం ఒక శక్తిగా ముందుకొచ్చి అధికారాన్ని ఎట్లా సంపాదించాయో విన్నారు మీరు. టంగుటూరి ప్రకాశం పంతులు వంటి బ్రాహ్మణులను తప్పిస్తూ నీలం సంజీవరెడ్డి, రెడ్లనును ఎట్లా పెనట్రేట్ చేశాడో దాన్నే బీ.సీలతో ఐక్యసంఘటన కట్టి తెలుగుదేశం కమ్మ కులాధికారాన్ని సాధించి జాతీయ రాజకీయాల్లోకి ఎలా ఎగబాకిందో మీరు తెల్సుకున్నారు."

"కుల వృత్తుల్లో ఉండిపోయినపుడు రాజకీయాల అధికార సమస్య మనకు, సంబంధించింది కాదనుకున్నాం. అందువల్ల జాతీయోద్యమంకన్నా బలంగానే కులసంఘాల ఉద్యమాలు నడిచినా - రాజకీయ లక్ష్యం లేకపోవడం వల్ల జాతీయోద్యమంలో భాగంగా చరిత్రకెక్కలేదు.

"రాజకీయాలంటే కులమో, వర్గమో, ధనమో, మతమో, సాంఘిక విప్లవమోకాదు. ఇందులో ఏ ఒక్కటీలేదు. అయితే వీటన్నిటినీ సమన్వయిస్తూ ,సమాజాన్ని, దాని చలన సూత్రాలను రెగ్యులేట్ చేస్తూ మెజారిటీ ప్రజల ,సమ్మతితో వీలైనంతమేరకు ,సమాజాన్ని ముందుకు నడిపేట్టు చేయడం రాజకీయం."

"ఇదిగో ఇప్పుడే ఆలస్యంగా వచ్చిన శంకరం గారిని తీసుకొండి. వీరి తండ్రి సర్పంచ్. కాని శంకరం గారు రాజకీయాల్లోకి రాకుండా ఉద్యోగంలో చేరాడు. మనవాళ్లల్లో చాలా మందికి ఇదే జబ్బు. ఉద్యోగం కావాలా! రాజకీయాలు కావాలా! అని అడిగితే ఉద్యోగం కావాలంటారు. అంటే రాజకీయ అధికారం మన కుటుంబ వ్యవస్థ తాలుకా ఎజెండాలో, అవగాహనలో లేదు."

"మరి మీరెందుకు ఉద్యోగం చేస్తున్నారు " శంకరం గారు కోపంగా లేచి టక్కున అడిగారు. బోధాయన కాస్త తడబడి టక్కున జవాబిచ్చాడు. "పొట్ట కూటికి."

"నేనూ అందుకే ఉద్యోగం చేశాను." శంకరం జవాబుతో లత ఓ మూలనుండి ఫక్కున నవ్వింది. చప్పట్లు కొట్టింది. అందరూ చప్పట్లు కొట్టారు. ఎవరెవరో లేచారు. ఎన్నోప్రశ్నలు. సదస్సులో కలకలం మొదలైంది. ఎక్కడికక్కడ గ్రూపుచర్చలు మొదలయ్యాయి. కొంతసేపాగి అందర్ని నిశ్శబ్దంగా ఉండమని కోరాడు బోధాయన.

"మీరు రాజకీయరంగంలో ఎందుకు పని చేయాలనుకుంటున్నారో అనే ఆలోచనలను మీ మీ నోటుబుక్కుల్లో ఎవరికి వారు రాయండి."

శంకరం తనకు పార్టీ టికెట్ ఖరారైన విషయం చెప్తే ఈ సభ నుండే తన ప్రచారం, మద్దతు ప్రారంభించి నట్టవుతుందని ఆ మాట బోధాయన చెవిలో వేశాడు. బోధాయన సరే కూర్చొమ్మని ముగిసిన తన ప్రసంగాన్ని మరికాస్త పొడిగించాడు.

"మిత్రులారా! కాబోయే నాయకులారా! దేశాధినేతలారా! ఒక మనవి. ఏదో ఒక పార్టీ టికెట్ యివ్వగానే పొంగిపోవద్దు. ఎడవెల్లి జగ్గారెడ్డిగారికి రెండుసార్లు యం.పి.టికెట్ యిచ్చారు. లక్షలు సొంతంగా ఖర్చుచేసి పార్టీ ప్రతిష్ట పెంచిందివీరే. కాని విద్యాసాగర్ రావు గారైతే ఈ సారి గెలుస్తారు. మనకొక సీటొస్తుందని కంటనీరు తుడిచారు. అంటే ఏమన్నమాట. ఓడిపోయేదాక పార్టీ టికెట్ నీకిస్తారు. గెలిచే ఇమేజ్ రాగానే గెలువగలడనుకునే వారికిస్తారు. వాళ్ళు గెలుస్తారు కూడా. అందువల్ల గెలువగలడు అనే యిమేజ్ సృష్టించుకోవడం చాలా ముఖ్యం.

చేగువేర అని ఒక విప్లవకారుడుండేవాడు. ఆయన ఏమంటాడంటే విప్లవ పరిస్థితులు ఎప్పుడైనా ఉంటాయి. కావాల్సిందల్లా వారిని మనం విప్లవించేట్టు చేయడమే. దీన్ని యిలా చెప్పవచ్చు. అవకాశాలు అనేవి ఎపుడూ ఉంటాయి. కావాల్సిందల్లా వాటిని మన అవకాశాలుగా మలుచుకొని ఎదిగే సంకల్పం అన్నిటికీ మూల ధనం."

క్లాసై పోయింది. భోజనాలు సాగుతున్నాయి. ఈశ్వరయ్యతో లత ఏదేదో చెప్పడం చూశాడు శంకరం. భోజనాలయ్యాక శంకరం దగ్గరికి వచ్చాడు ఈశ్వరయ్య.

"అది ఏమైనా రాజీ కొచ్చిందా! అని అడిగాడు శంకరం ఆసక్తిగా."

ఆఁ! కాస్త రాజీకొచ్చింది. నీకు రావల్సిన టికెట్‌ను తప్పకుండా వచ్చేట్టు చేసికోమన్నది లత" అంటూ ఆగాడు ఈశ్వరయ్య.

శంకరం ముఖంలో కళ తాండవించింది. ఎంతైనా అది తన కూతురు అని ఉబ్బిపోయాడు.

"అయితే" అంటూ ఆగాడు ఈశ్వరయ్య.

"అయితే? ఉత్కంఠ పెరిగింది శంకరంలో.

"అయితే పోలింగ్ ఏజెంట్లను నీ పార్టీ తరుపున కాకుండా తాను సూచించిన వారినే పెట్టాలని షరతు విధించింది. అపుడు అమె ఏజెంట్లూ నీ ఏజెంట్లూ కల్సి ప్రచారం, రిగ్గింగ్ వగైరా ఆమె కష్టపుగా పనిచేసుకోవడం సులభమైపోతుందట. అట్లా అయితే నువ్వు చేసిన తప్పును క్షమిస్తానంది లత."

"అంటే నేను ఓడిపోయి అది గెలవడం కోసం నన్ను టికెట్ తెచ్చుకొమ్మంటన్నదా."

"ఔను. రాజకీయాలు నీక్కూడా అర్థం అవుతున్నాయే." అంటూ శంకరంను ఈశ్వరయ్య అభినందించాడు.

నవ్వాలో ఏడ్వాలో తెలియక తల పట్టుకున్నాడు శంకరం. ఏదో గుంపులో చేరి లత నవ్వుతోంది.

ఆ నవ్వు శంకరానికి కారం రాసినట్లుగా ఉంది, మైకులోంచి "నా గెలుపు నీ గెలుపే కదా!" అంటూ పాటవిన్పిస్తోంది.

శంకరంకు అనుకున్నట్టుగానే టికట్టు వచ్చింది. ఎన్నికల ప్రచారం జోరందకుంది. లత పట్ల ప్రజలు బాగా స్పందిస్తున్నారు. లత గెలుపు ఖాయమని అందరినోట వినిపిస్తోంది.

శంకరంతో అప్పుడు అన్నాడు ఈశ్వరయ్య.

"ఆ పార్టీ టికట్ నీకు రావడం గొప్ప కాదట! ఆ పార్టీ టికెట్ నీ కొస్తే తన గెలుపు ఖాయమని ఎదుటి పార్టీ ముత్యం రెడ్డి నీ పార్టీలోని తన లాబీ ద్వారా వొత్తిడి తెచ్చాడట. నీకు టికెట్ ఇప్పించడానికి అతనికి రెండు లక్షల రూ॥ దాకా ఖర్చు వచ్చిందట. ఈ సంగతి ముందే తెల్సిన లత నీకు వ్యతిరేకంగా నిలబడ్తోంది. ముత్యం రెడ్డి లత గెలుస్తుందేమోనని ఇపుడు నీకన్నా ఎక్కువ బాధ పడ్తున్నాడు. మహిళ అనే దృష్టితో ఓట్లేస్తే లతనే గెలిచే అవకాశం వుందని, రాజకీయం తండ్రీకూతుళ్ళ చుట్టూ తిరగడంతో అతను అప్రధానమై మూడో వాడిగా దిగజారిండట. లత ఇందుకోసమే నిలబడిందట. లతకు నిజంగా నీమీద కోపం ఏమీ లేదటరా! ముత్యంరెడ్డి ఎత్తులకు పై ఎత్తుగా తాను నిలబడ్తోందట."

ఈ రాజకీయాలేమిటో అర్థం కాక తల పట్టుకొని కూలబడ్డాడు శంకరం. తనకు ఓడిపోవడానికే ఎక్స్ పార్టీ ముత్యం రెడ్డి తన పార్టీ టికెట్ ఇప్పించాడనే విషయం తెల్సి రాజకీయం మత్తంతా దిగిపోయింది.

**సుప్రభాతం (వార పత్రిక)22, మే,1999**